క్లుప్తంగా

నేడు ముఖ్యకార్యకర్తల సమావేశం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రిన్స్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు బహుజన సమాజ్ పార్టీ గద్వాల, అలంపూర్, వనపర్తి నియోజకవర్గాల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ అతిఖుర్ రహ్మాన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సమావేశానికి బీఎస్పీ రాష్ట్ర నాయకులతో పాటు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఎంసీ కేశవరావు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల అధ్యక్షుడు, బూత్ కమిటీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇంటింటికీ శ్రీరాముడి అక్షతలు

అయిజ: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా అయోధ్య నుంచి పంపించిన శ్రీరాముడి అక్షతలను ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమం కొనసాగుతోంది. గురువారం మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో, మండలంలోని సింధనూరులో శివరామాంజనేయ ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి శ్రీరాముడి అక్షతలు పంపిణీ చేశారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు



అయిజ: సంక్రాంతి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయులు విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. జడదొడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతిని మంజునాథ్, విష్ణు టీం గెలుచుకుంది. అదేవిధంగా ద్వితీయ బహుమతిని మానస, కవిత టీం, తృతీయ బహుమతిని భవిత, భాగ్యమ్మ టీంలు గెలుపొందాయి.

ముందస్తుగా సంబరాలు..

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని సరస్వతీ పాఠశాలలో గురువారం కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు పాల్గొని కొత్త రంగులతో అందరిని అబ్బురపరిచేలా ముగ్గులను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంక్రాంతి ఆవిశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు.

ఇళ్లకు బయలుదేరిన హాస్టల్ విద్యార్థులు..

మానవపాడు: మండలంలోని ఆయా పాఠశాలలో చదివే విద్యార్థులకు ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో గురువారం విద్యార్థులు వారి స్వగ్రామాలకు వెళ్లారు. సెలవులు రావడంతో విద్యార్థులు ఆనందంతో హాస్టల్ నుంచి వారి ఇంటికి బయలుదేరి వెళ్లారు.

పుస్తకాల పంపిణీ

అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం బీఆర్‌ఎస్ నాయకుడు సంకాపురం రాముడు వివేకానందుడి జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వామి వివేకానందుడు దేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పారని కొనియాడారు. ఆయన్ను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నర్సోజి, లక్ష్మన్న, తిమ్మారెడ్డి, వీరబాబు, ఈశ్వర్, దామోదర్, జయరాములు, శేఖర్, రామకృష్ణ, కొట్టం కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధార్థ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సురవరం లోకేశ్వర్



ఉండవెల్లి: మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సురవరం లోకేశ్వర్‌రెడ్డి, కంచుపాడు సర్పంచ్ శేషన్‌గౌడ్ నూతనంగా వచ్చిన కలెక్టర్ సంతోష్‌ను కలిసి పూలబొకె అందజేశారు. అనంతరం ఆర్టీసీ డీఎంను కలిసి వినతి అందజేశారు. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న బస్సులు స్టేజుల్లో నిలపాలని కోరారు.

ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి

ఉండవెల్లి: ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్‌ఐ బాల్‌రాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. ఇంటింటి దర్యాప్తులో భాగంగా వాహనాలు పరిశీలించారు. లైసెన్సులు, పేపర్లు లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ రాజు ఆధ్వర్యంలో కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఇద్దరు ఎస్‌ఐలు, 30 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. దాదాపు 31 ద్విచక్ర వాహనాలు, ఆటో పట్టుబడినట్లు తెలిపారు.

తాగునీటి కలుషితం

- అనారోగ్యాలకు గురవుతున్న ప్రజలు
- కనిపించని నీటి పరీక్ష కిట్లు
- నియోజకవర్గంలో 70,091 నల్లా కనెక్షన్లు
- మినరల్ వాటర్ వైపు మొగ్గుచూపుతున్న వైనం
- పట్టించుకోని పాలకులు, ప్రభుత్వం



దువాసిపల్లిలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్



సాసనూలులో ఎయిర్ వాల్ వద్ద కలుషితమవుతున్న నీరు

ఎర్రవల్లిచౌరస్తా: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేయాల్సిన అధికారులు వీటి జోలికి వెళ్లడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పైపులైన్లు లీకేజీలు కావడంతో పబ్లిక్ కొళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుంది. ఆ కలుషిత నీటిని తాగడంతో ప్రజలు నిత్యం అనారోగ్యం బారిన పడుతున్నా.. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే పల్లెల నుంచి అధికంగా విమర్శలు వినబడుతున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలో 124 గ్రామ పంచాయతీలు ఉండగా.. 70,091 తాగునీటి నల్లాలు ఉన్నాయి. కానీ ఎక్కడ కూడా నీటి పరీక్ష కిట్లు లేకపోవడంతో నీటి పరీక్షలు జరగడం లేదనే ఆరోపణలు ఉంటున్నాయి. దీంతో మరో గత్యంతరం లేక ప్రజలు డబ్బులు చెల్లించి మినరల్ వాటర్ వైపు మొగ్గ చూపుతున్నారు.

తప్పని పరిస్థితుల్లో మినరల్ వాటర్..

ప్రతి గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నెలకు ఒకసారి పర్యటించి ప్రతి గ్రామంలో తప్పకుండా తాగునీటి పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలో అధికారులు పర్యటించి కొళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటిని శాంపిల్ తీసుకొని ల్యాబ్‌కు పంపించాలి. అక్కడ నీటి పరీక్షలు జరిగిన తర్వాత ఆ నీరు తాగడానికి అనువుగా ఉన్నాయా లేదా అని తెల్పి ఆ సమాచారం గ్రామస్తులకు అందించాలి. కానీ ఏళ్ల గడుస్తున్నా పల్లెల్లో తాగునీటిని పరీక్షించిన దాఖలాలు కనపడటం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతంలో కలుషితమవుతున్న నీరు సరఫరా కావడంతో ప్రజలు అంటువ్యాధుల బారిన పడుతున్నారు. అధికారులు నీటి పరీక్షలు చేయించకపోవడంతో ప్రజలు తప్పని పరిస్థితుల్లో డబ్బులు వెచ్చించి మినరల్ వాటర్‌ను తాగుతున్నారు.

ఆయా మండలాల వారీగా నల్లాల వివరాలు..

మండలం	జీపీలు	నల్లాలు
ఇటిక్యాల	29	13,492
మానవపాడు	16	7,252
ఉండవెల్లి	16	9,696
అలంపూర్	14	9,687
వడ్డేపల్లి	10	7,675
రాజోలి	11	8,245
అయిజ	28	14,044



కారుపాకులలో నల్లా ద్వారా వస్తున్న కలుషిత నీరు(ఫైల్)

గ్రామాల్లో లీకేజీలు..

గ్రామీణ ప్రాంత ప్రజలకు పబ్లిక్ కొళాయిల ద్వారా శుద్ధ జలాన్ని అందించేందుకు గాను ప్రభుత్వం అవసరమైన ప్రత్యేక చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా రూ.వేల కోట్లను ఖర్చు చేసి మిషన్‌భగీరథ పథకాన్ని చేపట్టింది. ఈ పథకంలో భాగంగా ప్రతి పల్లెలోని ప్రతిఇంటికి నల్లా ద్వారా ఆరోగ్యమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంది. కానీ క్షేత్రస్థాయిలో ఇది ఎక్కడా సక్రమంగా పనిచేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా కూడా నీటి పరీక్ష కిట్లు అందుబాటులో లేవు. దీంతో గ్రామాల్లో లీకేజీల కారణంగా తాగునీరు కలుషితం కావడంతో కలుషిత నీటిని సరఫరా చేస్తున్నారు.



ఎర్రవల్లిలో లీకేజవుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్ (ఫైల్)

నీటి పరీక్షలు చేయడం లేదు...



గ్రామంలో ఎన్నడు కూడా అధికారులు నీటి పరీక్షలు చేయలేదు. పంచాయతీలో అక్కడక్కడ పైపులైన్లు లీకేజీలు కావడంతో నెలలో ఒక్కసారైనా కలుషిత నీరు సరఫరా అవుతుంది. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు సమస్య విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇలాంటి కలుషిత నీటిని తాగడంతో పలు రకాల వ్యాధుల బారిన పడిన సంఘటనలు చాలానే ఉన్నాయి. రోగాల బారిన పడి ప్రతిసారి ఆస్పత్రులకు బిల్లులు చెల్లించలేక మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి తాగుతున్నాం.

– తెలుగు వీరేష్, ఎర్రవల్లి, ఇటిక్యాల మండలం

నీరు కలుషితం కాకుండా చూస్తున్నాం..



గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అయ్యే తాగునీరు కలుషితం కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా పైపులైన్లు లీకేజీలు అయితే వెంటనే మరమ్మతు చేసి అరికడుతున్నాం. నల్లాల ద్వారా కలుషిత నీరు సరఫరా కాకుండా తగు చర్యలు తీసుకొని కేవలం శుద్ధి చేసిన నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నాం. ప్రతి గ్రామంలో నెలలో ఒకటి, రెండు సార్లు ఖచ్చితంగా నీటి పరీక్షలు చేయిస్తాం.

– వంశీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఇటిక్యాల మండలం

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి



మల్దకల్‌లో క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

మల్దకల్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో క్రికెట్ టోర్నీని ఆయన చేతులమీదుగా ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. క్రీడాకారులు మండల, జిల్లా స్థాయిలో కాకుండా, జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, సత్యారెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి, పెద్ద వీరన్న, నరేందర్, వెంకటన్న పాల్గొన్నారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

గద్వాల: విజయవాడలో శుక్రవారం నుంచి 14వ తేదీ వరకు కొనసాగే సౌత్‌జోన్ జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. సీనియర్ షూటింగ్ బాల్ పురుషుల విభాగంలో మంజునాథ్, రాజావర్ధన్ మహిళల విభాగంలో హరిత, జూనియర్ షూటింగ్ బాల్ బాలుర విభాగంలో ఆదిల్, బాలికల విభాగంలో ఫౌజియా, రాధిక ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్, షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు క్రిష్ణయ్య, కార్యదర్శి మంజునాథ్, పీడీలు హైమావతి, బీసన్న తదితరులు అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

గద్వాల: జాతీయస్థాయి పోటీలకు స్థానిక విశ్వభారతి టెక్నో స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు బీహార్‌లోని పాట్నాలో జరిగే అండర్–17 జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు పాఠశాలకు చెందిన సిద్ధార్థ ఎంపికయ్యారు. అలాగే ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు జార్ఖండ్‌లోని రాంచీలో నిర్వహించే అండర్–14 జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరూ తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థుల ఎంపికపై పాఠశాల ప్రిన్సిపాల్ త్యాగరాజు, హెచ్‌ఎం తిరుమలేష్ హర్షం వ్యక్తం చేస్తూ.. అభినందనలు తెలియజేశారు.

ఘనంగా అమావాస్య పూజలు



డి.బూడిదపాడులో పల్లకి సేవా



కేటీదొడ్డి ఆలయంలో..

ధరూరు / గట్టు / కేటీదొడ్డి / ఉండవెల్లి / శాంతినగర్/ మానవపాడు: మానవపాడు మండలంలోని గ్రామాల్లో గురువారం ఆలయాల్లో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో అభిషేకం, రుద్రాభిషేకం, ఆకు పూజ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ మారుతీనగర్ ఆంజనేయ స్వామి, ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉండవెల్లి మండలంలోని డి.బూడిదపాడు ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాములను పల్లకిలో ఆలయం చుట్టూ ఊరేగించారు. కేటీదొడ్డి మండల పరిధిలోని వెంకటాపురంలో వెలిసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసి, రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గట్టులోని గండి అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధరూరు మండల పరిధిలోని గ్రామాల్లో పూజలు నిర్వహించారు.



మానవపాడు అమరవాయిలో అన్నదానం

భక్తిశ్రద్ధలతో రథోత్సవం



మద్దూరులో రథోత్సవం

మానవపాడు: మండలంలోని మద్దూరులో చెన్నమల్లప్ప స్వామి జాతర ఉత్సావాల సందర్భంగా గురువారం ఘనంగా రథోత్సవ కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. రథాన్ని భక్తులు ఊరేగింపుగా పురవీధుల వెంట ఊరేగించారు. రథాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో అలంకరించి ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి భక్తులు రథాన్ని లాగితూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. నందికోళ్ల సేవ కార్యక్రమం నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ లక్ష్మిదేవి, ఎంపీపీ అశోక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

అలంపూర్: పుల్లూరు శివారులో లారీ ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు మృతిచెందగా.. మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స నిర్వహిస్తుండగా.. తెలుగు మధు ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ మన్యపు రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలియజేశారు.

తహసీల్దార్‌కు వినతి

అలంపూర రూరల్: మండల పరిధిలోని భీమవరానికి చెందిన నర్సింహ, చంద్రుడు భీమవరం శివారులోని సర్వే నంబర్ 167లో శాలమ్మ, బోయ వెంకట్రాముడుపై సీలింగ్ పట్టాదారులుగా చేర్చలని తహసీల్దార్ మంజులకు గురువారం వినతి అందజేశారు.

ఉద్యోగికి సత్కారం

అలంపూర్: ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పనిదని మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి అన్నారు. అలంపూర్ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అహ్మద్ షరీఫ్‌ను మున్సిపల్ అధికారులు, సిబ్బంది గురువారం సన్మానించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై మహబూబ్‌నగర్‌కు వెళ్తున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు పుష్పలత, సుష్మారావు, లక్ష్మిదేవమ్మ, సుదర్శన్ గౌడ్, నారాయణ, మద్దిలేటి, ఆంజనేయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి బాలసభ



బాలసభలో మాట్లాడుతున్న విద్యార్థిని

రాజోళి: పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను సిబ్బంది, కమిటీ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకునేందుకే బాలసభ నిర్వహించనున్నట్లు ఎంవీ ఫౌండేషన్ మండల కో– ఆర్డినేటర్ హనిమిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలో గురువారం బాలసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చిస్తూ.. విద్యార్థులకు ఉన్న సమస్యలను వారి ద్వారానే అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కొరత, అదనపు గదుల ఆవశ్యకత తదితర అంశాలపై చర్చించారు. ఉప సర్పంచ్ గోపాల్, హెచ్‌ఎం వెంకటేష్, రాజు, సుధాకర్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో ముగిసిన దరఖాస్తుల ఆన్‌లైన్



మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

అయిజ: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మండలంలో, మున్సిపాలిటీలో ప్రజలు పెట్టుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రియ మున్సిపాలిటీలో ముగిసినట్లు మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ తెలిపారు. మున్సిపాలిటీలోని 20వార్డుల్లో మొత్తం 8,881 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 5వ తేదీ నుంచి మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభించారు. గురువారంతో ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యింది. మండలంలో మొత్తం 15,523 దరఖాస్తులు వచ్చాయి. వాటిని గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, మీసేవ కార్యాలయాల సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గురువారం నాటికి 12,150 దరఖాస్తులు ఆన్‌లైన్ పూర్తయ్యాయి. శుక్రవారం నాటికి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తవుతుందని ఎంపీడీఓ సాయి ప్రకాష్ తెలియజేశారు.

పరిశోధన పత్రాల రచనపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేందర్

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ఫ్యాకల్టీ ఫోరం ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ ప్రచురణలో పరిశోధన పత్రాల రచనపై అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా మహబూబ్‌నగర్‌లోని ఎంవీఎస్ కళాశాలలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజేందర్ ప్రసంగించారు. అధ్యాపకులను రచన వ్యాసంగంపై తెలియజేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాష మాట్లాడారు. అధ్యాపకులు తప్పనిసరిగా జాతీయ, అంతర్జాతీయ ప్రచురణలో పరిశోధన పత్రాల వ్యాసాలను ప్రచురించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీపతినాయుడు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ మంజులత, ఫ్యాకల్టీ ఫోరం కన్వీనర్ కృష్ణమూర్తి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతి అందజేత



చింతలకుంట పాఠశాలలో బహుమతులు అందజేసిన ఎంఈఓ సురేష్

కేటీదొడ్డి: మండల పరిధిలోని చింతలకుంట పాఠశాలలో గురువారం జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకుని విద్యా సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ముఖ్య అతిథిగా ఎంఈఓ సురేష్ హాజరై చింతలకుంట పాఠశాల విద్యార్థులకు మొదటి బహుమతి, నందిన్నె పాఠశాల విద్యార్థులకు రెండో బహుమతిగా నగదు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసహాయ ఫౌండేషన్ ప్రతినిధులు సుదర్శన్, రాజశేఖర్ రెడ్డి, హెచ్‌ఎం ఆగస్టీన్, ఉపాధ్యాయులు ప్రహల్లాద్, ఐలప్ప, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా చేపట్టాలి



ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎర్రవల్లిచౌరస్తా: కొత్త ఓటరు జాబితాను బీఎల్‌ఓలు పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ నరేందర్ సూచించారు. గురువారం ఇటిక్యాల మండల కేంద్రంలోని 28, 29, మునుగాలలో 26, 27 పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా మార్పులు, చేర్పులతో పాటు డబుల్ ఓట్ల తొలగింపు, కొత్త ఓటరు నమోదు దరఖాస్తుల వివరాలను బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. కొత్త ఓటరు నమోదు ఈ నెల 22 వరకు ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని బీఎల్‌ఓలు పకడ్బందీగా పనిచేయాలని సూచించారు. ఆర్‌ఐ భీమ్‌సేన్‌రావ్ పాల్గొన్నారు.

వడ్డెర ఓపన్నకు ఘన నివాళి



వడ్డె ఓపన్న జయంతి నిర్వహిస్తున్న నాయకులు

అయిజ: మండల కేంద్రంలో గురువారం వడ్డెర సంఘం నాయకులు తొలితర స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓపన్న జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డె ఓపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సమకాలీన రాజులకు వడ్డె ఓపన్న సర్వసైన్య అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తుచేశారు. స్వాతంత్ర్య ఉద్యమకారులుగా ఉద్యమాలు చేస్తూ.. స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోసినటువంటి గొప్ప ఉద్యమ కారుడని కొనియాడారు. నాయకులు వేణు, వెంకటేష్, వెంకటన్న, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ధరూరులోని ఓ ఫర్టిలైజర్ షాప్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ శ్రీలత

ధరూరు: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత అన్నారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసీడ్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి షాప్ వద్ద విధిగా స్టాక్ బోర్డుతో పాటు ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. అలాగే నిర్ణీత ధరలకే విక్రయించాలని సూచించారు. నకిలీకి తావులేకుండా నాణ్యమైన ఎరువులు, మందులు రైతులకు అందించాలన్నారు. అలాగే ఒక రకమైన ఎరువు తీసుకుంటేనే మరొక రకం ఇస్తామని కొందరు డీలర్లు అంటున్నారని, రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని అలా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. గోదాంలోని స్టాక్‌ను పరిశీలించారు.

పోలీసు కుటుంబానికి అండగా ఉంటా..

గద్వాల క్రైం: జిల్లా సాయుధ దళ పోలీసు కార్యాలయంలో ఏఆర్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సురేష్‌బాబు అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ రితిరాజ్, ఏఎస్పీ రవి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. మహబూబ్ నగర్‌లోని మోతినగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు గద్వాల ఏఆర్ డీఎస్పీ ఇమ్మానియల్ వారి నివాసం చేరుకుని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తక్షణ ఆర్థిక సాయం కింద రూ.20 వేలు, పోలీసు సంఘం తరపున రూ.30 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు.